క్లుప్తంగా

క్రీడలకు ప్రోత్సాహం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కల్లూరు: ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని క్రీడాకారులు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, బ్యాట్‌మెంటన్, వాలిబాల్, కబడ్డి క్రీడాల్లో పోటీలో పాల్గొన్నాలకున్న క్రీడాకారులు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కబడ్డి కోచ్ భూపతిరావు, కల్లూరు, ఉలిందకొండ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న కేవీ సుబ్బారెడ్డి

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం బి ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ, ఫార్మ డి విద్యార్థులకు ఓరియేంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి చైర్మన్‌తో పాటు కరస్పాండెంట్ విజయలక్ష్మి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ తప్పనిసరి అన్నారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపల్ రమణ పాల్గొన్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ దస్తగిరి

పాణ్యం: కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. బుధవారం గగ్గటూరు, కొత్తూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామాలపై ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. అలాగే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి, చిన్న తరహా పరిశ్రమలు నిర్వహించాలనుకునే వారికి అనేక రాయితీలను కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సద్దల సద్మావతి, బీరం రాజేశ్వరి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

కల్లూరు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఉద్దేశమని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దటేకూరు, తడకనపల్లె గ్రామాల్లో వికసత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దటేకూరులో జరిగిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల్ గ్యాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ పథకాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఉలిందకొండ, కల్లూరు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నంది బాలోత్సవ్ బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న శివరామ్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల డైరెక్టర్ మిద్దె శివరామ్ నంది బాలోత్సవ్ బ్రోచర్‌ను విడుదల చేశారు. డిసెంబర్ 28, 29వ తేదీల్లో నంద్యాలలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం చెర్మన్ శంకరయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. మిద్దె శివరామ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో బాలోత్సవ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు మున్సిపాల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 3-10తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చాన్నారు. పోటీల్లో అకడమిక్ సంస్కృతి విభాగాల్లో 38 రకాల పోటీలు ఉంటాయని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కల్లపరిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి జగనన్న అండగా నిలుస్తున్నారన్నారు. మండలంలోని కల్లపరి గ్రామ సచివాలయంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా 33 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరిన లబ్ధి వివరాల బోర్డును అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ అవినీతికి తావు లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలను అందజేస్తోందన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేని చంద్రబాబు ప్రజలను సోమరులను చేస్తున్నారంటూ విషం చిమ్ముతున్నాడని విమర్శించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరో మారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచులు రంగమ్మ, మధుసూదన్‌రెడ్డి, వైసీపీ లీగల్ సెల్ ఇంచార్జి లాయర్ ప్రభాకర్, స్థానిక నేతలు పురంధర్‌రెడ్డి, రాజారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈరన్న, నరసింహారెడ్డి, జీవన్, సుధాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

ప్రతికుటుంబానికి సంక్షేమ పథకాలు

గూడూరు రూరల్: ప్రతికుంటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. చనుగొండ్లలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానిక బస్టాండ్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. అనంతరం ప్రజలను ఆయన ఉద్దేశించి మాట్లాడుతూ అవినీతి, లంచాలకు అవకాశం లేకుండా అర్హులందరికీ నేరుగా బ్యాంకు ఖాతాలకు సంక్షేమ ఫలాల నగదు జమచేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి జగనన్న అండగా నిలిచారన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలు గురించి వివరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు దౌల, మహేశ్వరరెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు (కార్పొరేటర్) శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి'- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనలో తేడాను గమనించాలన్నారు. 32వ వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ర్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శివ, సుభాన్, సచివాలయ కన్వీనర్లు దుర్గాప్రసాద్, రాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని కంబదహాల్‌లో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క సచివాలయం ద్వారా ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వం రూ.22,98,52,613 ఖర్చు చేసిందని చెప్పారు. నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ప్రజలకు అర్థమయ్యేలా వైఎస్సార్‌సీపీ శ్రేణులు వివరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే సంక్షేమ బోర్డు, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, గృహ సారథులు జయరామిరెడ్డి, రాముడు, రాజు, రఘురెడ్డి, ఏలియ తదితరులు పాల్గొన్నారు.



32వ వార్డులో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి



కంబదహాల్‌లో సర్వే మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

ఓర్వకల్లు: గ్రామీణ ప్రజల అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మీదివేముల గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు రజితమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రభాకర్‌రెడ్డితో పాటు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, ఎంపీపీ తిప్పన్న, మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, నన్నూరు సర్పంచు బ్రహ్మయ్య, సచివాలయ కన్వీనర్లు జగన్‌మోహన్ రెడ్డి, రమేష్‌నాయుడు, లక్ష్మిదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పార్టీ నేతలు

ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు : బూత్ లేవల్ అధికారులు (బీఎల్‌వో) ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు పారదర్శకంగా చేపట్టాలని పాణ్యం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 ఎన్ని కొత్త ఓట్లు నమోదు చేశారు, ఎన్ని తొలగించారు, ఎన్ని అడ్రస్‌లు మార్చారాని నివేదికలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో వారి పోలింగ్ కేంద్రంలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌వోలు పని చేయకపోతే సూపర్‌వైజర్లు ఎఈఆర్వోలకు నివేదిక అందించాలని సూచించారు. ఒకే ఇంట్లో 10 మంది కంటే ఎక్కువ ఓట్లు ఉంటే క్షుణంగా పరిశీలించాలన్నారు. సమావేశానికి హాజరుకాని వారిపై, విధుల పట్ల అలసత్వంగా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేష్ బాబు, శివప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ఎన్నికల డీటీ అనురాధ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న నిర్వాహకులను హెచ్చరిస్తున్న అధికారులు

కర్నూలు (న్యూటౌన్): అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామ సమీపంలోని వక్ఫ్ బోర్డు భూమిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలకు ప్రయత్నిస్తుండడంతో ఆకస్మికంగా దాడి చేశారు. ఆయన మాట్లాడుతూ ఉల్చాల గ్రామ సమీపంలో రోడ్డు కాంట్రాక్టు పనులకు అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న నిర్వాహకులను హెచ్చరించి జేసీబీ, హిటాచీ, లారీలను అక్కడి నుంచి తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, అక్రమంగా గ్రావెల్ తవ్వితే సహించేది లేదని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



లక్ష్మీపురంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లక్ష్మీపురం, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దటేకూరు గ్రామాలలో పర్యటించారు. పెద్దటేకూరులో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. లక్ష్మీపురంలో ఇంకా అతిసార కేసులు వస్తున్నాయా? లేదా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆశా కార్యకర్తలు గ్రామంలో పైపులైన్లను పరిశీలించాలన్నారు. అతిసార పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు మెడికల్ క్యాంపు కొనసాగించాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి అస్వస్థతకు గురైన వారు ఉన్నారా? లేదా? అని వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు కాచి వడపోసిన నీటిని తాగాలని, ఇంటింటికి వెళ్లి క్లోరినేషన్ ట్యాబెట్లు, ఓఆర్ఎస్ అందించాలన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించండి

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. బుధవారం మండలంలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆమె సందర్శించారు. శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు భాషాంశాలపై పూర్తి అవగాహన కల్పించేలా తరగతులు బోధించాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. మెనూ పాటించాలని, వంట పాత్రలు, పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ వంట నిర్వాహకులను సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం మునిస్వామి, టీచర్లు ఉన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఉయ్యాలవాడలో గడప గడపకు మన ప్రభుత్వం
- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



సంక్షేమ క్యాలెండర్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు శకుంతలమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, పార్టీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి హాజరయ్యారు. స్థానిక ఎస్సీ కాలనీ, కుమ్మరి వీధి, కాపగేరి, బోయపేటలో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. నాలుగన్నరేళ్ల పాలనలో వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.కొందరు సొంత ఇళ్లులేక పాత ఇళ్లల్లోనే కాలం గడుపుతున్నామని, మరి కొందరు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి బాగుచేయాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయమన్నారు.

రుణ మాఫీ చేస్తానని మోసం చేసిన టీడీపీ

గత టీడీపీ ప్రభుత్వం పొదుపు మహిళలకు బ్యాంకు రుణాలను మాఫి చేస్తామని చెప్పి మోసం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి వారి మాటలను నమ్మవద్దన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గత ఏప్రభుత్వంలో జరగలేదని స్పష్టం చేశారు. మరింత అభివృద్ధి జరగాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, నాయకులు ఎల్లశేఖరరెడ్డి, బొమ్మన నాగేశ్వరరెడ్డి, బొమ్మన రామిరెడ్డి, పల్లె మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గడివేముల: పేడరంగు తాగి అస్వస్థతకు లోనైన గడిగరేవుల గ్రామానికి చెందిన చిలకల చిన్న స్వాములు (33) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్న స్వాములు కొన్నేళ్లుగా ఆటోను నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఆటోకు వివిధ ఫైనాన్స్‌లో లోన్లు తీసుకుని సకాలంలో చెల్లించలేదు. అప్పులు అధికం కావడంతో మంగళవారం ఎవరూ లేని సమయంలో పేడరంగు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నంద్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య చిలకల ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతోనే గుర్తింపు

గూడూరు రూరల్: క్రీడలతోనే క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. గూడూరులోని వైకేపీ భవనంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ళు పైబడిన యువతీ, యువకులు పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ వంటి పోటీలను నియోజకవర్గ, జిల్లా స్థాయిలో డిసెంబర్ 15న, ఫిబ్రవరి 3న నిర్వహించనుందన్నారు. ఈ పోటీల ముఖ్య ఉద్దేశం క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను కనుగొని వారికి పెద్ద వేదికకు తీసుకెళ్లడం, క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ సునీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం



సి.బెళగల్‌లో ఆడుదాం ఆంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

సి.బెళగల్: డిసెంబర్ 15 నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రంగం కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఐదు క్రీడాంశాలలో (క్రికెట్, కబడ్డీ, ఖో ఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్) పోటీలను నిర్వహించాల్సి ఉందన్నారు. 15 సంవత్సరాలు నిండి క్రీడలపై ఆసక్తి కలిగిన యువతీ, యువకులు రిజిస్ట్రేషన్లు చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, ఆదామ్‌బాషా, ఏఎస్‌ఓ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి రూ.3,16,000 చెక్కును అందజేస్తున్న వెంకట సత్యనారాయణ

ఆలయ నిర్మాణానికి విరాళం

కోడుమూరు రూరల్: కోడుమూరులో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి అమెరికాలో స్థిరపడిన కర్నూలుకు చెందిన అచంట వెంకటసత్యనారాయణ, పద్మావతి దంపతులు రూ.3,16,000 చెక్కును బుధవారం చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డికి బుధవారం అందజేశారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆలయాలు ధర్మ నిలయాలని, వ్యాపార సముదాయములు కాదని చాటిచెప్పే ప్రయత్నములో భాగంగా రూ.10కోట్ల వ్యయంతో దాతల సహకారంతో శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. పూర్తిగా పురాతన పద్ధతిలో రాతి శిలలు, దూలాలతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయ నిర్మాణ విశిష్టతను తెలుసుకున్న వెంకట సత్యనారాయణ ఆలయంలో నిర్వహించే శాశ్వత నిత్యన్నదాన పథకానికి విరాళం అందజేశారన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజశేఖర్, వేణుగోపాల్, ఎల్ఐసీ తిమ్మారెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: పల్లెల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని, పట్టణాలతో సమానంగా మౌలిక వసతుల కల్పిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని కొండాపురం సచివాలయ పరిధిలోని బుధవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కొండాపురం వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, తిలకందిద్ది స్వాగతించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అదే విధంగా ప్రజలు విన్నవించిన సీసీ రోడ్లు, డ్రైన్, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా పైపులైన్ ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందాయని గుర్తు చేశారు. లంచాలకు ఏ మాత్రం తావివ్వకుండా పేదలందరికీ నేరుగా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సీఎం జగనన్న చేయూతనిస్తున్నారని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, సర్పంచ్ రత్నమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, విద్యుత్, పీఆర్ ఏఈలు సుకుమార్, గంగరాజు, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, వీఆర్వో రంగముని, వైస్సాఎర్‌సీపీ నాయకులు ఆనందం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.